క్లుప్తంగా

ఒకే ఈతలో రెండు లేగదూడల జననం



ఆవుకు ఒకే కాన్పులో పుట్టిన లేగ దూడలు

కాళ్ల: ఆవు ఒకే కాన్పులో రెండు లేగ దూడలకు జన్మనిచ్చిన అరుదైన ఘటన కాళ్ల మండలం పెదఅమీరంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆకుల నాగరాజు అనే పాడి రైతు జెర్సీఆవు శనివారం ఉదయం రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. గతంలో రెండు కాన్పుల్లో ఒక్కో దూడకు జన్మనిచ్చిన ఆవు ఈసారి రెండు ఆవుదూడలకు జన్మనివ్వడం ఆనందంగా ఉందని రైతు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం



బాధితులకు ప్రభుత్వ సహాయం అందిస్తున్న తహసీల్దార్ తదితరులు

ఉండి: ఈ నెల 26వ తేదీన మహదేవపట్నం ఉప్పరగూడెంలో జరిగిన అగ్నిప్రమాదంలోని బాధిత కుటుంబాలకు శనివారం తహసీల్దార్ నాగార్జున ఆధ్వర్యంలో ప్రభుత్వ సహాయాన్ని అందజేశారు. కుడిపూడి పద్మావతి, లంక అమ్మాజీ కుటుంబాలకు ప్రభుత్వం తరుపున 25 కేజీల బియ్యం, రూ.5 వేలు నగదు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వనిమా నాగ వెంకటసుబ్బలక్ష్మి వీఆర్వోలు ఎస్ చిన్నారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చదరంగం శిక్షణ తరగతులు



విద్యార్థులకు చదరంగం ఆటపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడు, కాళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదరంగం ఆటపై నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయని నిర్వాహకులు తెలిపారు. చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తోట హరి బాబు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు శిక్షణా తరగతులు జరిగాయన్నారు. అనంతరం చదరంగం ఆటపై ఉచిత శిక్షణ మెటీరియల్ విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్వా జోన్‌పై గ్రామసభ



మహదేవపట్నంలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: ఆక్వాజోన్‌లో లేని చెరువులను ఆక్వాజోన్‌లో చేర్చుటపై శనివారం మహదేవపట్నం గ్రామ సచివాలయంలో సర్పంచ్ వనిమా నాగవెంకట సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆక్వాజోన్‌లో చేర్చు చెరువుల సర్వే నంబర్లపై అభ్యంతరాలు ఉంటే రైతులు తెలియజేయాలన్నారు. అలాగే వరి సాగుకు అనుకూలంగా లేని పొలాలు, చెరువులు తవ్వుకునేందుకు అనుకూలంగా ఉన్న పొలాల వివరాలను రైతులు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఆక్వా రైతులు వనిమా శ్రీనివాస్, వీఆర్వో ఎస్ చిన్నారావు, మత్స్యశాఖ అధికారి మూరా సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రోత్సాహక బహుమతుల అందజేత



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేసిన దృశ్యం

భీమవరం అర్బన్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శనివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. దిరుసుమర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన యశస్వినికి రూ. 6 వేలు, దివ్యకు రూ. 5 వేలు, ఎం షీనాకు రూ. 4 వేలు అందజేశారు. పూర్వ విద్యార్థి 1979 బ్యాచ్‌కు చెందిన శ్రీ చక్రపాణి అయ్యంగార్ దాతృత్వంతో ఈ కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో సారంగపాణి, పీవీ రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాట్లు... మరీ లేటు



నీరు లేక ఖరీఫ్ దమ్ములకు నోచుకోని వరి పొలాలు



ఇప్పుడిప్పుడే సిద్ధం చేసుకుంటున్న నారుమళ్లు

- ఆలస్యంగా ఖరీఫ్ సాగు
- నారుమళ్లకు నోచుకోని డెల్టా శివారు ప్రాంతం
- కాలువలొచ్చినా ఫలితం లేదు
- ముందొచ్చినా కనికరం లేని నైరుతి

ఆకివీడు: ఈ ఏడాది ఖరీఫ్ నాట్లు ఆలస్యమయ్యాయి. ముందస్తు ఖరీఫ్ సాగు ఎలా ఉన్నా, కనీసం ఆగస్టు నెలాఖరు నాటికి నాట్లు పూర్తవుతాయా అన్న సందేహం రైతుల్లో ఏర్పడింది. ఖరీఫ్ సాగు త్వరితగతిన చేపట్టాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు సూచించినా వరుణుడు కరుణించలేదు. పంట కాల్వలు కనికరించలేదు. పంట కాల్వలు వదిలి నెల రోజులు కావస్తున్నా చుక్క నీరు సాగుకు వినియోగించుకునే స్థితి లేకపోవడంతో దమ్ము పనులు ప్రారంభం కాలేదు. ఎట్టకేలకు గత నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో రైతులు సాగు పనులకు సిద్ధమవుతున్నారు.

మెట్ట దుక్కులూ కానరాలేదు

ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు రైతులు పంట పొలాల్లో మెట్ట దుక్కులు చేసి సిద్ధం చేసిన దాఖలాలు కన్పించలేదు. గతంలో మెట్ట దుక్కులు దున్ని, పంట కాల్వలకు నీరు, వర్షాల నీటితో దమ్ము పనుల్ని వేగంగా పూర్తి చేసేవారు. ఈ ఖరీఫ్ అన్నింటిలోనూ వెనుకబడి ఉంది. దాళ్వా మాసూళ్లు పూర్తయిన తరువాత చేలల్లో నవధాన్యాలు, పచ్చిరొట్ట సాగు అక్కడక్కడా మాత్రమే చేపట్టారు.

సిద్ధమవుతున్న నారుమళ్లు

మరో వారం రోజులకు నారుమడులు సిద్ధం అయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పుడిప్పుడే నారుమళ్ల కోసం దమ్ము పనులు చేపడుతున్నారు. వారం పది రోజులకు నారమడులు సిద్ధం చేసి విత్తనాలు నాటే అవకాశం ఉంది. నారు పోసిన తరువాత సుమారు 15 రోజుల వరకూ నాట్లు వేసే అవకాశం ఉండదు. ఆగస్టు నెలాఖరు వరకూ నాట్లు కొనసాగవచ్చునంటున్నారు.

ఖరీఫ్‌కు అనువైన వంగడాలివే

ఖరీఫ్‌సాగుకు నియోజకవర్గంలో అనువైన వంగడాలను సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఎంటీయూ 1318 రకం వంగడాన్ని రైతులు అధికంగా సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీనితో పాటు పీఎల్ఆర్ 126 రకం సన్నాలు సాగు చేస్తున్నారు. ఈ రకం వంగడాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంలేదు. అయినప్పటికీ సన్న రకం కావడంతో రైతులు ఆసక్తిగా సాగు చేస్తున్నారు. ప్రైవేటు వంగడం స్వర్ణ సంపద సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఎంటీయూ 7029 స్వర్ణ వంగడాన్ని రైతులు పూర్తిగా విస్మరించారు. ముంపును తట్టుకునే గుణం లేకపోవడమే కారణం. కొల్లేరు, ఉప్పుటేరు తీర ప్రాంతాల్లో సెలినిటీ ప్రభావం ఉన్న చోట ఎంటీయూ 1262, ఎంసీఎం 100 రకాల్ని సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఖరీఫ్ సాగు ఆలస్యమే



ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆలస్యమవుతోంది. వర్షాభావ పరిస్థితులు, జూలై వరకూ నారుమడులు వేయకపోవడం వల్ల నాట్లు సకాలంలో పడే అవకాశం లేదు. దీనివల్ల పంటలు నవంబర్, డిసెంబర్ నెలల్లో వచ్చే తుపాను, భారీ వర్షాలకు గురయ్యే ప్రమాదం ఉంది. కాలువలు ఈనెల 1వ తేదీన వదిలినా నెలాఖరు వరకూ మంచినీరే ప్రవహించలేదు.

– ఎరిచర్ల సాంబర్లిన్, రైతు, చెరుకుమిల్లి, ఆకివీడు మండలం

అనువైన వంగడాలే వాడాలి



అనువైన వంగడాల్నే సాగు చేసుకోవాలి. ప్రభుత్వం కొనుగోలు చేసే వంగడాలతో పాటుగా, స్థానికంగా సాగుకు ఇబ్బందిలేని వంగడాల్ని సాగు చేయడం ద్వారా మంచి దిగుబడులతో పాటు, రైతు సకాలంలో ధాన్యం అమ్ముకునే అవకాశం ఉంటుంది. పీఎల్ఆర్ 126 వంగడాన్ని ప్రభుత్వం సేకరించడంలేదు. ఈ విషయాన్ని గ్రామ సభల్లో తెలియజేస్తున్నాం.

– మదన్ మోహన్, మండల వ్యవసాయాధికారి, ఆకివీడు

ఉపాధ్యాయులకు సత్కారం

పాలకోడేరు: వేండ్ర జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన వారికి, అలాగే ఇక్కడకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను శనివారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీవీ శ్రీనివాసు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీపై వెళ్లిన కేపీ పరదేశి బాబు, వీరవల్లి సూర్యకుమార్, సువర్ణకృపలను, అలాగే ఈ పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు జె .శ్రీనివాసరావు సీహెచ్ రాధ, పంపన సాయిబాబు, ఫణి రాజేష్, విశ్వనాథరాజు, ఎస్.నాగబాబులను సత్కరించారు.

మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలను ఉపేక్షించం

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం: పట్టణంలోని అల్లూరి రామకృష్ణరాజు (ఏఆర్‌కెఆర్) మునిసిపల్ హైస్కూల్‌ను శనివారం జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం, వంటగది పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పథకం అమలులో ఎటువంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వంట గది ఎప్పుడూ శుభ్రంగా ఉండాలని, కీటకాలు రాకుండా కిటికీలకు మెస్ వేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు కిరణజన్య సంయోగా క్రియ సైన్స్ పాఠంను జేసీ రాహుల్ కుమార్ రెడ్డి స్వయంగా బోధించారు. ఆయన వెంట డిప్యూటీ డీఈవో ఎం.రమేష్, తహసీల్దార్ రావి రాంబాబు, ఎంఈఓలు ఎస్ శ్రీనివాసరావు, వేండ్ర వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.



ఏఆర్‌కేఆర్ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ

మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ

భీమవరం: పట్టణంలోని అడబాల చంద్రరావు మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజనం పథకాన్ని సోమవారం జిల్లా సమన్వయ కర్త కె కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోషకాలతో కూడిన మెనూతో పాటు సన్నబియ్యం భోజనం పెడుతున్నందున విద్యార్థులంతా మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలో ప్యూరిఫైయర్ ద్వారా పరిశుభ్రమైన తాగు నీటిని విద్యార్థులకు అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్ సుధారాణి ఎస్ఎంసీ చైర్‌పర్సన్ రోజారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయం వద్ద వేలం

ఉండి: వెలివర్రులో ప్రసిద్ధి గాంచిన వీరపేరంటాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద శనివారం ఎండోమెంట్ అధికారులు ఆలయ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ అధికారి తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారి చీరలు, దుకాణం నిర్వహణ, కొబ్బరిచెట్లు, కొబ్బరి చెక్కల సేకరణపై వేలం నిర్వహించారు. ఏడాది కాలనికి గాను అమ్మవారి చీరలు, జాకెట్ల సేకరణకు గొడవర్తి శ్రీనివాస్ రూ.1.90 లక్షలకు, దుకాణ నిర్వహణకు కుడిపూడి శ్రీనివాస్ రూ.2.76 లక్షలు, కొబ్బరి చెట్లు నల్లూరి చంద్రకుమార్ రూ.7,500, కొబ్బరి చెక్కల సేకరణకు బొక్కా రెడ్డియ్య రూ.30 వేలు, షామియానా నిర్వహణకు రూ.93,500 చొప్పున వేలం దక్కించుకున్నారు. కార్యక్రమంలో పలువురు దేవాదాయ శాఖ అధికారులు ,గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద వేలం నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

మానసిక వైద్యశాలలను సందర్శించిన జడ్జి

భీమవరం: భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శాంతి, ప్రశాంతి, వర్మ మానసిక వైద్యశాలలను భీమవరం రెండవ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్ జ్యోతి సందర్శించి మానసిక రోగులతో మాట్లాడారు. రోగులకు అందుతున్న వైద్య, వసతి సదుపాయాలను, వారి మానసిక స్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి ఎటువంటి న్యాయపరమైన సలహాలు అవసరమైన మండల న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు బి సురేష్ కుమార్, కె జ్యోతి, ఎంబీ భవాని, మానసిక వైద్యులు జీవీ రమణరావు, మాదిరెడ్డి వెంకటరమణ, శ్రీదేవి, టూటౌన్, ఎస్సై రామారావు తదితరులు పాల్గొన్నారు.



మానసిక రోగులతో మాట్లాడుతున్న జడ్జి జ్యోతి

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

భీమవరం: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు, శనివారం భీమవరంలో యర్రంశెట్టి చిన్నసుబ్బరాజు అధ్యక్షతన జరిగిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, చింతకాయల బాబురావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టాలు అమలు కాకపోవడం వల్ల వేల సంఖ్యలో క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

కాలువల ప్రక్షాళన పనుల పరిశీలన

కాళ్ల: ఆకివీడు డీసీ పరిధిలో సుమారు రూ.70 లక్షలతో కాలువల మరమ్మతుల పనులు చేపట్టినట్లు ఆకివీడు డీసీ చైర్మన్ గోకరాజు వెంకట శివరామరాజు, డ్రెయినేజీ ఏఈ జయప్రకాష్ తెలిపారు. కాళ్ల మండలం జువ్వలపాలెం పరిధిలోని పొలిమేర కోడు మురుగు డ్రెయిన్ ప్రక్షాళన పనులు శనివారం వారు పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. డీసీ పరిధిలోని రుద్రాయకోడు మురుగు డ్రెయిన్‌ను సుమారు రూ.32 లక్షలతో, చినకాపవరం మీడియం డ్రెయిన్ ప్రక్షాళన పనులు సుమారు రూ.28 లక్షలతోను, అదేవిధంగా అవిసెలకోడు, ఉప్పుటేరు రైల్వే బ్రిడ్జి దగ్గర పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపు పనులతో పాటు వెంకయ్య వయ్యేరు కాలువలో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు కూడా చేపట్టినట్లు ఆయన స్పష్టం చేశారు. వీటితోపాటు ఎన్నో ఏళ్లగా అభివృద్ధికి నోచుకోని జువ్వలపాలెం పొలిమేర కోడు మురుగు డ్రెయిన్ పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అజ్జమూరు గ్రామ పరిధిలో రుద్రాయకోడు మురుగు డ్రెయిన్‌పై ఉన్న అక్రమ కట్టడాలను సైతం తొలగిస్తామని ఏఈ జయప్రకాష్ తెలిపారు. రైతులతోపాటు ప్రజలందరూ సహకరించాలని కోరారు.



జువ్వలపాలెం పరిధిలో పొలిమేర కోడు మురుగు డ్రెయిన్ తవ్వుతున్న దృశ్యం

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

వీరవాసరం: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశ వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఆశా వర్కర్ల యూనియన్ వీరవాసరం మండల విస్తృస్థాయి సమావేశం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. యూనియన్ నాయకులు డి వరలక్ష్మి సమావేశానికి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీహెచ్ లక్ష్మి మాట్లాడారు. ఆశ వర్కర్లపై పని ఒత్తిడి తగ్గించాలని, పీహెచ్‌సీ పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రికార్డ్స్ ఇవ్వకుండానే రికార్డ్స్ రాయమంటున్నారని, ఆన్‌లైన్ వర్క్‌లతో పాటు ఇతర పనులను కూడా అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశార. ఆశా వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం అంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బేబీ, సంతోష్ వాణి, దుర్గ, శిరీష, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి సహస్ర దీపాలంకరణ



సహస్ర దీపాలంకరణలో పద్మావతి అమ్మవారితో శ్రీవేంకటేశ్వరస్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని జేపీ రోడ్డులో ఉన్న శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారికి శనివారం ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. వేంకట సత్య దుర్గ నాగ సోమరాజు దంపతులచే ఈ కార్యక్రమం జరిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పట్టణం నుంచి గ్రామానికి తరలిపోతున్న గురుకుల పాఠశాల

విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఉన్న మహాత్మాజ్యోతీబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర వసతి గృహం (గురుకుల పాఠశాల) యలమంచిలి మండలం కట్టుకాల్వ గ్రామానికి తరలిస్తున్నారు. బ్రాడీపేట బైపాస్ పెనుమదం రోడ్డు జంక్షన్‌లో ఉన్న జీ–ప్లస్ పోర్ భవనంలో ఈ హాస్టల్ 2018లో ఏర్పాటు చేశారు. కింద గ్రౌండ్‌ఫ్లోర్‌లో వెనుక భాగంలో కిచెన్ ఏర్పాటు చేశారు. మిగిలిన పై నాలుగు ఫ్లోర్‌లు పాఠశాల, హాస్టల్‌గా ఉపయోగిస్తున్నారు. పై రెండు ఫ్లోర్‌లు పాఠశాలకు ఉపయోగించగా మిగిలిన రెండు ఫ్లోర్‌లు హాస్టల్‌కు ఉపయోగిస్తున్నారు. విద్యార్థులకు ఇక్కడ వసతులు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల రాకపోకలకు కూడా ఈ ప్రాంతం అనువుగా ఉంటుంది. ఈ హాస్టల్‌లో విద్యార్థులు సుమారు 180 మంది ఉండగా ప్రస్తుతానికి నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఉంది కాబట్టి 140 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

భవన యజమాని ఖాళీ చేయమనడంతో..

ఈ భవనంలో 5 నుంచి 9వ తరగతి వరకూ విద్యార్థుల వసతితో పాటు పాఠశాలను కూడా నిర్వహిస్తున్నారు. అయితే భవనం యజమాని భవనాన్ని ఖాళీ చేయాలని ఆదేశించడంతో ఇక్కడ నుంచి గురుకుల పాఠశాలను యలమంచిలి మండలం కట్టుకాల్వ గ్రామానికి తరలిస్తున్నారు. కట్టుకాల్వ లో జీప్లస్ టు భవనంలోకి గురుకుల పాఠశాలను మారుస్తున్నారు. గతంలో ఈ భవనంలో ఓ ప్రైవేటు పాఠశాలను ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. పట్టణంలో ఉన్న భవనానికి ఇప్పటివరకూ నెలకు రూ. 1.80 లక్షలు అద్దె చెల్లిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కట్టుకాల్వలో తీసుకున్న భవనానికి సుమారు రూ.1.20 లక్షలు వరకూ అద్దె ఉంటుందని అంటున్నారు. పల్లె నుంచి చదువులు, వ్యాపారాలు నిమిత్తం ప్రజలు, విద్యార్థులు పట్టణానికి వస్తుంటే పట్టణంలో ఉన్న గురుకుల విద్యాభ్యాసం పల్లెకు పోతుండడం ఒకింత పట్టణవాసులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ముఖ్యంగా సెలవుల సమయంలో రాకపోకలకు విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది.



ప్రస్తుతం నడుస్తున్న బీసీ బాలురు గురుకుల పాఠశాల భవనం



బీసీ హాస్టల్‌ను తరలిస్తున్న కట్టుకాల్వ గ్రామంలో భవనం

జూన్ 30 నుంచి కొత్త భవనంలో..



హాస్టల్ భవనం మేము ఖాళీ చేయాలన్నా లేదా యజమాని మమ్మల్ని ఖాళీ చేయించాలన్నా రెండు నెలలు ముందుగా చెప్పాలనే షరతులు ఉన్నాయి. ఆ ప్రకారం భవన యజమాని రెండు నెలలు ముందుగానే ఖాళీ చేయాలని స్పష్టం చేశారు. అందువల్ల జూన్ 30లోపు భవనం ఖాళీ చేయాల్సి ఉంది. యలమంచిలి మండలం కట్టుకాల్వలోని జిప్లస్ టు భవనంలోకి ఈ హాస్టల్‌ను మారుస్తున్నాం. పట్టణంలో ఇంత అనుకూలమైన భవనం అందుబాటులో లేకపోవడం వల్ల యలమంచిలి మండలం కట్టుకాల్వ గ్రామానికి తరలిస్తున్నాం.

– డి.ఈశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాల, పాలకొల్లు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో కొత్త విద్యుత్ తీగల మార్పిడి నిమిత్తం ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. నర్సయ్యఅగ్రహారంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏడీఏగా ప్రసాద్ జీవన్

ఆకివీడు: ఆకివీడు వ్యవసాయ సహాయ సంచాలకులుగా ప్రసాద్ జీవన్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఏడీఏ కేఎస్ఎస్.శ్రీనివాసరావు భీమవరం బదిలీ అయ్యారు. రంపచోడవరం ఏడీఏగా పనిచేస్తున్న ప్రసాద్ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

భీమవరం: వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 32 మంది లబ్ధిదారులకు రూ.23.32 లక్షల విలువచేసే సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల చెక్కులను పంపిణీ చేశారు.

అభివృద్ధికి సహకరించండి

కాళ్ల: బొండాడ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ భర్త మన్నే నాగరాజు హితవు పలికారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కుళాయిల ద్వారా మురుగు నీరు సరఫరా చేశామని ఆరోపించటం తగదన్నారు. గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టామని, మంచినీటి పైపు దెబ్బతినడం వల్ల, మ్యాన్ హోల్‌లో నిలిచిన వర్షం నీరు కలిసినట్టు వివరణ ఇచ్చారు. ప్రస్తుతం పైపులైను మరమ్మతులు పూర్తిచేశామని, అధికారులు సూచనలమేరకు పైపులైను మారుస్తామన్నారు. ప్రజలు ఏవిధమైన అపోహలు పెట్టుకోవద్దని కోరారు. ఆయనవెంట మన్నే సోమేశ్వరరావు, మన్నే శ్రీనివాసరావు ఉన్నారు.

30న సీనియర సిటిజన్స్ ఫోరం దశాబ్ది వార్షికోత్సవం



భీమవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: సీనియర సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ దశాబ్ది వార్షికోత్సవం ఈనెల 30వ తేదిన భీమవరంలో నిర్వహిస్తున్నట్లు ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు నల్లం వెంకటకృష్ణనాగేశ్వరరావు, తాళ్లపూడి గాంధీ చెప్పారు. వార్షికోత్సవం పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సంఘం ద్వారా 2014 నుంచి పేద వృద్ధులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఆకుల వేంకట శేషసాయి, ఎమ్మెల్యే అంజిబాబు హాజరవుతారన్నారు.

సికిల్ ఎనీమియాపై వైద్య సిబ్బందికి అవగాహన

పాలకోడేరు: కుముదవల్లి గ్రామంలో జిల్లా మలేరియా ఇన్‌చార్జి అధికారి డాక్టర్ క్రాంతి ఆధ్వర్యంలో శనివారం వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సికిల్ ఎనీమియా అంటే ఏమిటి, ఈ వ్యాధి ఎలా వస్తుంది, దానికి సంబంధించిన పరీక్షలు ఏ విధంగా చేయాలి, ఎవరికి వస్తుంది, ఏ విధంగా నియంత్రించవచ్చు అనే అంశాలపై వైద్య సిబ్బందికి క్షుణ్ణంగా వివరించారు. ముఖ్యంగా ఈవ్యాధి జన్యుపరంగా చిన్నపిల్లల్లో వస్తుందని, గ్రామాల్లో తరచూ వైద్య పరీక్షలు నిర్వహించి సికిల్ ఎనీమియా లక్షణాలు కనిపించినట్లయితే ఆరంభం నుంచి తగు మందులను వాడించితే ఆ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజకుమార్, ఎంఎల్‌హెచ్‌పీ మహాలక్ష్మి, ఏఎన్ఎంలు భవాని, హేమ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.